సాక్షి
కుమురం భీం
బుధవారం : 8 : ఫిబ్రవరి : 2023



ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగా రావు అన్నారు. విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి నిర్వహించారు. 8లో▸



ఘనంగా రమాబాయి జయంతి

జిల్లా వ్యాప్తంగా రమాబాయి అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రమాబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. 9లో▸



వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /15.8

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్రాక్‌సూట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ పాట్నాలో ఈ నెల 10 నుంచి 12 తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి లక్ష్మణ్, కోచ్ విద్యాసాగర్, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పీఈటీ మహేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

తిర్యాణి(ఆసిఫాబాద్): పంటల సాగులో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామంలో కొలాం, తోటి తెగలకు చెందిన రైతులు సాగు చేస్తున్న జొన్న పంటను మంగళవారం పరిశీలించారు. ఆదివాసీలు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. సాగులో సమస్యలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్, శాస్త్రవేత్తలు శ్యామ్‌ప్రసాద్, నాగరాజు, ఏడీఏ మిలింద్, ఏవో తిరుమలేశ్వర్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఏఈవోలు ముత్తయ్య, శ్రవణ్, సాగర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న 41అడుగుల అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శిరీష్ శర్మ, మాడుగుల నారాయణమూర్తి, నిమ్మకంటి మహేశ్ శర్మ, ఢిల్లీ విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం కలశ గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్ పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ధర్మపురి వెంకటేశ్వర్లు, గుండ వెంకన్న, పిన్న వివేక్, మధుకర్, ఎకిరాల శ్రీనివాస్, ఇరుకుల్ల సుధాకర్, మురళిగౌడ్, కొలిప్యాక వేణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ జాతర ఆదాయం రూ.34.67లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.34.67లక్షల జాతర ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం హుండీ లెక్కించారు. ప్రత్యేక దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1,31,010, సులభ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,30,550, శీఘ్ర దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.2,47,700, కేశ ఖండనం ద్వారా రూ.4,590, కొబ్బరికాయల విక్రయం కోసం నిర్వహించిన వేలం ద్వారా రూ.1,76,500, ప్రసాదాల విక్రయ వేలం ద్వారా రూ.2,76,000, పార్కింగ్ నిర్వహణ కోసం వేలం ద్వారా రూ.1,85,000, తైబజార్ వేలం ద్వారా రూ.7,03,000లతోపాటు హుండీ ద్వారా రూ.15,13,300ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. గతేడాదితో పోల్చితే అదనంగా రూ.9,08,444 ఆదాయం సమకూరిందన్నారు.

మెరుగు పడని వృద్ధి!



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తలసరి ఆదాయం, జిల్లా స్థూల ఉత్పత్తి మెరుగుపడడం లేదు. గత రెండేళ్లుగా కోవిడ్‌తో తేరుకున్న తర్వాత కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్థికంగా పరిపుష్టి కావడం లేదు. 33జిల్లాల్లో ఉమ్మడి జిల్లా జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్), తలసరి ఆదాయం సూచికలు ఇంకా మెరుగు పడాల్సి ఉంది. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రణాళిక విభాగం విడుదల చేసే రాష్ట్ర ఆర్థిక, సామాజిక, ఆర్థిక ముఖచిత్రం 2023ను ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముందు ప్రవేశపెట్టింది. ఈ వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లా ఇంకా ఆయా రంగాల్లో వృద్ధి చెందాల్సి ఉంది.

- జీడీడీపీ, తలసరి ఆదాయం అంతంతే
- పెరుగుతున్న విద్యుత్, ఎల్పీజీ వాడకం
- ఉమ్మడి జిల్లాలో ఇంకా మారాల్సిన పరిస్థితులు
- సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2023లో వెల్లడి

అభివృద్ధికి సూచిక జీడీడీపీ

ఒక ప్రాంతంలో ఒక ఆర్థిక సంవత్సరం జరిగిన అంతిమ వస్తు సేవల వినియోగం ఆ ప్రాంత జీడీడీపీని సూచిస్తుంది. ఈ జీడీడీపీ ఆ ప్రాంత అభివృద్ధి సూచికగా ఉంటుంది. రాష్ట్రంలో ఇంకా కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల జీడీడీపీ మెరుగు కావాల్సి ఉంది. అలాగే తలసరి ఆదాయం మెరుగుపడాల్సి ఉంది. 2022 జూన్‌లో విడుదల చేసిన సామాజిక ఆర్థిక ముఖచిత్రంలో పెరుగుదల కనిపించలేదు.

జీడీడీపీ 2018-19నుంచి 2020-21 వరకు(రూ.లలో)

జిల్లా	ప్రస్తుత ధరలు (ఎఫ్ఆర్ఈ)	స్థిర ధరలు (ఎఫ్ఆర్ఈ)
ఆదిలాబాద్	12,68,948	8,05,296
నిర్మల్	12,57,558	7,54.150
మంచిర్యాల	15,48,421	9,78,432
కుమురంభీం	7,93,501	4,83,622




తలసరి ఆదాయం 2018-19నుంచి 2020-21 వరకు (రూ.లలో)

జిల్లా	ప్రస్తుత ధరలు (ఎఫ్ఆర్ఈ)	స్థిరధరలు
ఆదిలాబాద్	1,52,455	94,587
నిర్మల్	1,52,634	89,308
మంచిర్యాల	1,60,883	98,914
కుమురంభీం	1,31,843	78,282



పశుసంతతి పెంపు శాతంలో (2019 నాటికి)



విద్యుత్ కనెక్షన్లు (2021-22)



విద్యుత్ కనెక్షన్లలో మంచిర్యాల ముందంజలో ఉండగా, కుమురంభీం చివరన ఉంది. అలాగే ఎల్పీజీ ఉపయోగిస్తున్న గృహాల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది.

ప్రైవేటు స్కూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. సర్కారు బడుల్లో విద్య నాణ్యత పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నా ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లాలో నిర్మల్‌లో అధికంగా ఉండగా, కుమురంభీంలో అత్యల్పంగా ఉన్నాయి.

అందుబాటులో ఉన్న ప్రైవేటు స్కూళ్లు

జిల్లా	స్కూళ్లు
ఆదిలాబాద్	157
నిర్మల్	209
మంచిర్యాల	228
కుమురంభీం	128



అడవులను కాపాడుతున్నాం



రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణమున్న ఐదు జిల్లాల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొదటి ఐదు జిల్లాలను చూస్తే కొత్తగూడెం, ములుగు, నాగర్‌కర్నూల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లోనే 50శాతం అడవులు విస్తరించి ఉన్నాయి.

ఈ-పంచాయతీలో భాగంగా పల్లెప్రగతి యాప్‌లో రోజు వారీగా పారిశుధ్యం, రోడ్లు, మురికి కాలువల తదితర నివేదికలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు రోజువారీగా వివరాలు యాప్‌లో అప్‌లోడ్ శాతంలో చూస్తే...

ఆదిలాబాద్	74.77
నిర్మల్	80.54
మంచిర్యాల	76.28
కుమురంభీం	71.39

ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతంలో ప్రతిరోజూ కనీస కూలి దక్కేలా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి మించి నిర్మల్‌లో మాత్రమే కూలీలు వెళ్తున్నారు. ఆదిలాబాద్‌లో తక్కువగా ఉంది.



ఉపాధి హామీలో రోజువారీగా కూలీల పని లక్ష్యం, నమోదైన వివరాలు (లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నమోదు	శాతం
ఆదిలాబాద్	36.5	30.6	84
నిర్మల్	41	44.6	109
మంచిర్యాల	26.2	23.5	90
కుమురంభీం	29.7	29.6	100

మారని తీరు!



కొనసాగుతున్న నిర్మాణ పనులు



సీసీ క్యూబ్స్ తయారు చేస్తున్న సిబ్బంది

- అరకొరగా స్టోన్‌డస్ట్, నాసిరకం ఇసుక వినియోగం
- కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారి అండ!
- నాణ్యత లేకుండా వట్టివాగు ఊమ్ పైప్ బ్రిడ్జి నిర్మాణం
- నామమాత్రపు చర్యలతో సరిపెట్టిన సింగరేణి సివిల్ విభాగం

సాక్షి, ఆసిఫాబాద్: 'వడ్డించేవాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటేనేం..' అన్న చందంగా మారింది తిర్యాణి మండలం కైరిగూడ వద్ద నిర్మిస్తున్న సెకండ్ డైవర్షన్ వట్టివాగు కాలువపై 150 మీటర్ల పొడవైన ఊమ్ పైప్ బ్రిడ్జి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పరిస్థితి. ఇప్పటికే అక్కడ శాశ్వతంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.04 కోట్ల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో అత్యవసరం పేరిట బెల్లంపల్లి సింగరేణి ఏరియా జీఎం ఊమ్ పైప్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతిచ్చిన విషయం తెలిసిందే. అతికొద్ది మంది కాంట్రాక్టర్ల జాబితా నుంచి ఎల్1 నిలిచిన అంజిరెడ్డి అనే వ్యక్తికి పనులు అప్పగించారు. ఓ ఉన్నతాధికారి అండ ఉన్నారనే ధీమాతో కాంట్రాక్టర్ నాసిరకంగా ఈ పనులు చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం నామమాత్రపు చర్యలతో సరిపెట్టడంతో రూ.1.65 కోట్ల విలువైన ఈ బ్రిడ్జి పనులు తీసికట్టుగా సాగుతున్నాయి.

చర్యలకు వెనుకడుగు..

జిల్లాలోని తిర్యాణి మండలం ఉల్లిపిట్ట- కైరిగూడ మధ్య సింగరేణి అధికారులు వట్టివాగు కాలువ సెకండ్ డైవర్షన్ పనులకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఊమ్ పైప్ బ్రిడ్జి నిర్మాణాన్ని శరవేగంగా చేసి అప్పగించాలన్న ఉద్దేశంతో పనుల్లో నాణ్యత పట్టించుకోవడం లేదని సమాచారం. ఇదే విషయాన్ని గత నెల 31వ తేదీన 'అత్యవసరం పేరిట వారధి' శీర్షిక పేరుతో 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. అందులో పనుల నాణ్యతపై ఆధారాలతో సహా వివరించింది. అయితే సింగరేణిలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి అండదండలతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలకు సివిల్ విభాగం అధికారులు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం మందలించడంతోనే సరిపెట్టినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం కొల్లూరు ఇసుక వాడాల్సి ఉంది. కానీ స్థానికంగా చిర్రకుంట గ్రామంలో లభించే నాసిరకం ఇసుకనే వినియోగిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సివిల్ విభాగంలోని కొందరు అధికారులు చెబుతున్నారంటే పనులు నాణ్యత ఎలా ఉందో అర్థమవుతోంది.

స్టోన్‌డస్ట్ వినియోగించాలంటూ ఆదేశాలు

'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో బెల్లంపల్లి ఏరియా సింగరేణి సివిల్ విభాగం ఉన్నతాధికారులు అరకొర చర్యలకు ఉపక్రమించడం గమనార్హం. నాసిరకం ఇసుక బదులు స్టోన్‌డస్ట్‌ను వినియోగించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ చేసిన పనుల్లో మెటీరియల్ నాణ్యతను పరిశీలించేందుకు సీసీ క్యూబ్స్‌ను సిద్ధం చేశారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాక అధికారులు ఇలాంటి చర్యలు తీసుకున్నా ఫలితం ఉండదని నిర్మాణ రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక బెడ్డింగ్, పైపుల జాయింట్ల వద్ద పూసిన సిమెంట్ పూతలపై వాటర్ క్యూరింగ్ విషయంలో ఎలాంటి మార్పు లేదు. నేటికీ బకెట్లతో నీటిని తీసుకెళ్లి వాటిని తడుపుతున్నారు. మూణ్నాళ్ల ముచ్చటగా నిర్మిస్తున్న ఈ తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోట్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతున్నా అధికారులు పట్టనట్టుగా ఉండటం విశేషం.

బడిలోనే 'ఆధార్'

- పాఠశాలల్లోనే వివరాలు నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్
- జిల్లాలో 1,263 స్కూళ్లలో 92,701 మంది విద్యార్థులు

తిర్యాణి(ఆసిఫాబాద్): విద్యాశాఖలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్కూళ్లు, కాలేజీల్లో బయోమెట్రిక్ అమలు చేస్తోంది. వసతి గృహాల్లో సైతం బయోమెట్రిక్ విధానంలోనే విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు. అయితే జిల్లాలో 50శాతం మందికి పైగా విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో బయోమెట్రిక్ మిషన్లలో వేలిముద్రలు పడటం లేదు. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆధార్, నమోదు, సవరణ, వేలిముద్రల అప్‌డేట్ కోసం పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండలానికి ఒక ఆపరేటర్ చొప్పున నియమించారు. వీరి ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలు స్వీకరించనున్నారు.

పక్కా సమాచారం..

జిల్లాలో పాఠశాల విద్యార్థులకు పూర్తిగా ఆధార్ కార్డులు అందజేయడం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బయోమెట్రిక్ అమలు ద్వారా విద్యార్థుల హాజరు మరింత పకడ్బందీగా నమోదవుతుంది. సంక్షేమ వసతి గృహాల్లో సరుకులు పక్కదారి పట్టకుండా నివారించవచ్చు. పారదర్శకత మరింత పెరుగుతుంది.



తిర్యాణి మండల కేంద్రంలో విద్యార్థి ఆధార్ వివరాలు అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

'అందరికీ ఆధార్' లక్ష్యంతో..

జిల్లాలో మొత్తం 1,263 స్కూళ్లలో 92,701 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. చాలా మంది వెనుకబడిన ప్రాంతాల నుంచి రావడం, తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం, ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో 50శాతం మందికి ఆధార్ కార్డు లేదు. ఆధార్ కార్డులు పొందకపోవడంతో గిరిజన విద్యార్థులతోపాటు గిరిజనేతరులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. విద్యాశాఖ చేపట్టే వివిధ కార్యక్రమాల్లో విద్యార్థుల వివరాలు నమోదు చేయడం ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆధార్ లేనివారికి ఉచితంగా కార్డు అందజేయడంతోపాటు ఇప్పటికే ఉన్నవారికి తప్పులు సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందుకోసం విద్యార్థుల పేరు, ఆధార్‌కార్డు నంబర్, ఐరీస్, వేలిముద్రలు, తల్లిదండ్రులకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు.

అప్‌డేట్ చేస్తున్నాం

జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ కార్డులు అప్‌డేట్ చేస్తున్నాం. ఇప్పటికే మండలాల వారీగా ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఆపరేటర్లను నియమించాం. ఆధార్ కార్డులు లేపోవడంతో విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయలేకపోతున్నాం. విద్యార్థులకు కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు బయోమెట్రిక్ కోసం వివరాలు అప్‌డేట్ చేస్తున్నాం.

– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

ఆర్టీసీకి రెండు శాతం నిధులు కేటాయించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జేఏసీ కన్వీనర్ టి.దివాకర్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో రెండు శాతం నిధులు కేటాయించి, ప్రతినెల ఆర్టీసీకి విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను అమలు చేయాలని, ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని, ఆర్టీసీలో యూనియన్లను అనుమతించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ఉమేశ్, రవి, భిక్షపతి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ రాజేశం
- పత్తి కొనుగోళ్లపై సమీక్ష

ఆసిఫాబాద్: రైతులకు ఎలాంటి నష్టం లేకుండా పత్తి కొనుగోళ్లు చేపడతామని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పక్క రాష్ట్రాల్లో చెల్లిస్తున్న విధంగా పత్తికి కనీస మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘాల నాయకులు కోరగా, పత్తి ధరపై గతంలోనే ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని తెలిపారు. రైతులు, మిల్లు యజమానులు పరస్పరం సమన్వయంతో కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. మిల్లర్లు క్యాష్ కటింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు



బాధితుడితో మాట్లాడుతున్న కోవ లక్ష్మి

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం దేవుల గూడ వద్ద ట్రాక్టర్ ఢీకొని ఆసిఫాబాద్ మండలం కోసారా గ్రామంలోని భవానీనగర్‌కు చెందిన అజ్మీర కైలాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కైలాస్ మంగళవారం భార్య, కుమార్తెతో కలిసి బైక్‌పై మందమర్రికి బయలుదేరాడు. మార్గమధ్యలోని దేవులగూడ వద్ద ఎదురు వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. కైలాస్ కుడికాలు విరగడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఈఎంటీ శంకర్, పైలెట్ సంతోష్ క్షతగాత్రుడిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మానవత్వం చాటుకున్న జెడ్పీ చైర్‌పర్సన్

ట్రాక్టర్ ఢీకొని గాయాలతో పడిఉన్న కైలాస్‌ను చూసిన వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి వాహనం ఆపి బాధితుల వద్దకు వెళ్లారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

నర్సరీలో విద్యుత్ పరికరాల చోరీ

భీమారం: మండల కేంద్రం సమీపంలో మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారిపై సెంట్రల్ నర్సరీలో మొక్కలకు నీటిని సరఫరా చేసే పంప్ సెట్టు విద్యుత్ పరికరాలు సోమవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. నర్సరీలో మొక్కలను నీరందించేందుకు రెండు బోరీ బోరుబావులు ఉన్నాయి. వీటికి సంబంధించిన స్టార్టర్‌తోపాటు ఇతర సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలిచారు.

రూ.257 కూలీ వచ్చేలా పనిచేయాలి



పూడిక తీత పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

దండేపల్లి: ఉపాధిహామీ పథకంలో కూలీలు దినసరి కూలి రూ.257 వచ్చేలా పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి అన్నారు. మండలంలోని మేదరిపేట సమీపంలో డిస్ట్రిబ్యూటరీ కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. రోజుకు కనీసం ఐదు నుంచి ఆరు గంటలు పని చేయాలని, ఎండల తీవ్రత పెరుగుతోందని, ఉదయం ఏడు గంటలకే పనులు ప్రారంభించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు ఈ వారంలో విడుదలవుతాయని తెలిపారు.

11న లోక్ అదాలత్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 11న లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తె లి పారు. అపరిష్కృత సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. బాధితులు లోక్ అదాలత్‌ను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. వి వాహ గొడవలు, సివిల్ కేసులు, భూవివా దాలు, రాజీకి అర్హత ఉన్న క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



మాట్లాడుతున్న చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు



పాల్గొన్న అధికారులు

- విద్యుత్ వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించాలి
- ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదు
- ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగరావు
- వినియోగదారులతో ముఖాముఖి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, వారితో మర్యాదగా వ్యవహరించాలని విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని పద్మనాయక మినీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యుత్ వినియోగదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యమానికి ఈఆర్‌సీ సభ్యులు మనోహర్‌రాజు, బి.కిష్టయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరంగారావు మాట్లాడుతూ గ్రామాల్లో లూప్‌లైన్, లోఓల్టేజ్, విద్యుత్ అంతరాయం, స్తంభాలు పగలడం వంటి సమస్యలపై ప్రజాప్రతినిధులు, వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామనని హెచ్చరించారు. వినియోగదారుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు వస్తే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదు

ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదని, ఈఆర్‌సీ అనుమతితోనే విద్యుత్ సంస్థ వినియోగదారుల నుంచి వసూలు చేస్తోందని శ్రీరంగారావు స్పష్టం చేశారు. వినియోగదారులకు ముందస్తు నోటీసులు ఇవ్వకపోవడం విద్యుత్ సంస్థ తప్పేనని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులు రవాణా, మరమ్మతు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, సంస్థ ఏర్పాటు చేసిన వాహనం ద్వారానే తరలించాలని తెలిపారు. ఆలస్యమైనప్పుడు స్వంతంగా తీసుకొస్తే చార్జీల కింద సంస్థ రూ.700 చెల్లిస్తుందని తెలిపారు. అనంతరం 'విద్యుత్ పంపిణీదారుల పని తీరు ప్రమాణాలు' అనే పుస్తకాన్ని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది చదవాలని సూచించారు. విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదులను 040 23311121, 28నంబర్లలో చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 54 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావు తెలిపారు.

- గ్రామంలో త్రీఫేజ్ కరెంట్ సప్లయి సరిగా ఉండకపోవడం వల్ల మొక్కజొన్న, వరి పంటలు ఎత్తిపోయే పరిస్థితి నెలకొందని, త్రీఫేజ్ సప్లయిలో అంతరాయం లేకుండా చూడాలని, మరమ్మతులు చేపట్టాలని దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్ సర్పంచ్ సత్యవతి కోరారు.
- విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ కట్టి నెలలు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వలేదని కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం ఆరెగూడకు చెందిన సద్గురు తిరుపతి, తాండూర్ మండలం అచ్చులపూర్ సర్పంచ్ దాగం శంకరమ్మ ఫిర్యాదు చేశారు.
- లూప్‌లైన్లతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు మార్చాలని భీమిని మండలం వీగం గ్రామానికి చెందిన తులసిబాయి, రామగౌడ్, జన్నారం మండలం దర్మారం సర్పంచ్ దుర్గం గంగాధర్, దండేపల్లి మండలం రెబ్బనపల్లికి చెందిన కందుల కళ్యాణి కోరారు.
- జన్నారం మండలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ మోటార్ల కనెక్షన్లు, వినియోగం పెరిగి తరచూ అంతరాయం ఏర్పడుతోందని, నాలుగు గ్రామాలకు ఒక్కరే లైన్‌మెన్ ఉన్నారని జన్నారం మండలం చింతగూడకు చెందిన రైతు ఆరె శిరీష్‌కుమార్ తెలిపాడు.

ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఈశ్వరయ్య, సభ్యుడు(ఫైనాన్స్) కిషన్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు(కమర్షియల్) సంధ్యారాణి, ఐపీసీ డైరెక్టర్ గణపతి, రాజేష్ చౌహాన్, అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులు తీసుకున్నారు..



తన కొత్త ఇంటికి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని లైన్‌మెన్ సంప్రదిస్తే రూ.1.80 లక్షలు అవుతుందని, లైన్‌మెన్ కోటేష్ ద్వారా కాంట్రాక్టర్ పోచం డబ్బులు తీసుకున్నాడు. ఎనిమిది నెలలైనా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. రెండు నెలల క్రితం రూ.1.60 లక్షలు సంస్థకు డీడీ కట్టాడని తెలిసింది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తే ఎక్కడైనా చెప్పుకో అంటున్నాడు.

– రాజేంద్రప్రసాద్, నస్పూర్

ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలి



పంటపొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినప్పుడు మరమ్మతులకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. రోడ్డుకు మార్చాలని కోరితే రూ.1.50లక్షలు అంచనా వేశారు. ఇది చాలా ఎక్కువ తగ్గించాలి. 200 ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక్కరే విద్యుత్ సిబ్బంది ఉండడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఏసీడీ చార్జీలు నిరుపేదలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. చార్జీలు ఎత్తివేయాలి.

– కారుకూరి తిరుపతి, గ్రామం: కొర్విచెల్మ, మం: దండేపల్లి

ప్రధానోపాధ్యాయురాలి తీరుపై నిరసన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో భిక్షపతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామ పంచాయతీలోని ఆరెగూడ(ఏ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. పిల్లల పట్ల దురుసుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయడం లేదని, విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. వెంటనే ప్రధానోపాధ్యాయురాలిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో గడ్డం భిక్షపతి పాఠశాలను సందర్శించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు.

'పది'లో 10 గ్రేడ్ సాధించాలి

భీమిని: పదో తరగతిలో 10వ గ్రేడ్ సాధించాలని జిల్లా సెక్టోరల్ అధికారి పద్మజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను పరిశీలించారు. పాఠశాల అప్‌గ్రేడ్ అయినందున జూనియర్ కాలేజీ భవనం నిర్మించేందుకు స్థలాన్ని భీమిని కేజీబీవీ ఎస్ఓ కవితతో కలిసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున సన్నద్ధం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ పదిలో 10 గ్రేడ్ సాధించేలా ప్రత్యేక క్లాసులు చెప్పాలని టీచర్లకు సూచించారు. ఆమె వెంట ఎస్ఓ కవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీపీఏలో చీఫ్ సెక్యూరిటీ అధికారి పర్యటన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారి (రిటైర్డ్ ఎస్పీ) శశిధర్‌రాజు పర్యటించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గోలేటి ఓసీపీ, ఎంవీకే ఓసీపీలపై చర్చించారు. అనంతరం నూతన ఓసీపీల ప్రతిపాదిత ప్రాంతాలను సందర్శించారు. ఏరియాలోని చెక్‌పోస్టులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సింగరేణి ఖాళీ స్థలాల ఆక్రమణలపై సెక్యూరిటీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా సంస్థకు చెందిన వస్తువులు, ఆస్తులు చెక్‌పోస్టు దాటకుండా చూడాలన్నారు. ఏరియాలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, జూనియర్ ఎస్టేట్స్ అధికారి సుధాకర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి స్థలాలను పరిశీలిస్తున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్‌రాజు

సెంట్రింగ్ ప్లేట్లు దొంగిలిస్తున్న నలుగురి అరెస్ట్

- 844 ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సురేశ్‌కుమార్



పోలీసులు పట్టుకున్న వాహనంలో ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లు దొంగిలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో సిబ్బందితో కలిసి వెంకట్రావ్‌పేట్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. సిర్పూర్ నుంచి వెంకట్‌రావుపేట్ వైపు వస్తున్న టాటాఏస్ వాహనాన్ని తనిఖీ చేశారు. కాగజ్‌నగర్ మండలం బెంగాలీ క్యాంప్‌నకు చెందిన సురేశ్ టికేదర్, సిర్పూర్(టి) మండలం గొల్లవాడకు చెందిన గాడం విష్ణు, ఈస్‌గాం విలేజ్ నం.10కి చెందిన కార్తీక్ మండల్, పల్లవ్ మండల్ సెంట్రింగ్ ప్లేట్ల లోడ్‌తో వెళ్తున్నారు. గతంలో సెంట్రింగ్ ప్లేట్లు చోరీకి గురైనట్లు కేసు నమోదు కావడంతో పోలీసులకు అనుమానం వచ్చి ఆ నలుగురిని విచారించారు. చోరీ చేసిన ప్లేట్లను తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంతోపాటు అందులోని 105 ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హీరాపూర్ శివారులో సురేష్‌కు చెందిన పత్తి చేనులో దాచి ఉంచిన మరో 739 సెంట్రింగ్ ప్లేట్లను సైతం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు..

జల్సాలకు అలవాటుపడిన నిందుతులు చోరీలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈస్‌గాం, సిర్పూర్– టి, రెబ్బెన, ఆసిఫాబాద్‌తోపాటు తాళ్లగుర్జాల సమీపంలో నిర్మాణ పనులు జరిగే ఇళ్లు, ఆలయాల వద్ద రాత్రి సమయంలో సెంట్రింగ్ ప్లేట్లను చోరీ చేస్తున్నారని పేర్కొన్నారు. వీటిని సురేశ్ టికేదర్‌కు చెందిన వాహనంలో హీరాపూర్ శివారులోని చేనులో దాచి ఉంచి, మహారాష్ట్రలో విక్రయించేందుకు వెళ్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 9 కేసులు నమోదు కాగా, పట్టుకున్న 844 ఇనుప సెంట్రింగ్ ప్లేట్ల విలువ రూ.6,80,800 ఉంటుందన్నారు. కౌటాల సీఐ బుద్దే స్వామి, సిర్పూర్(టి) ఎస్సై రమేశ్, ఏఎస్సై రాములు, హోంగార్డులు సయ్యద్ హాజీ, దీపక్‌లను అభినందించారు.

యువకుడి మృతదేహం లభ్యం



యువకుడి మృతదేహం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ శివారు రాళ్లవాగులో మంగళవారం ఉదయం గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహంతోపాటు మోటార్‌బైక్ పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, మందమర్రి సీఐ ప్రమోద్‌రావు, పట్టణ ఎస్ఐ అశోక్ పరిశీలించారు. మోటార్‌సైకిల్ నంబరు ఆధారంగా మంచిర్యాలకు చెందిన సంపత్‌కు ఫోన్ చేయగా.. తన మోటార్‌సైకిల్ సోమవారం నుంచి కనిపించడం లేదని, ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశానని పోలీసులకు తెలిపాడు. మృతదేహంపై గాయాలు, రక్తపు మరకలు ఉండడంతో హత్యగా భావించి పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కెకాన్ కూడా సంఘటనా స్థలానికి వచ్చారు. డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులను రప్పించి విచారణ సాగించారు. కాగా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు మృతుడి ఊపిరితిత్తుల్లో నీరు చేరినట్లు గుర్తించారు. అంటే మృతుడు నీటిలో పడే వరకు కూడా బతికే ఉన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. హత్యకు గురయ్యాడా, మోటార్‌సైకిల్‌పై నుంచి వాగులో పడి నీరు మింగి చనిపోయాడా అనే అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచామని, మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని మందమర్రి సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు
- కాగజ్‌నగర్‌లో ముగిసిన గోల్డెన్ కప్ పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు క్రీడామైదానంలో న్యూఎరా క్రికెట్ క్లబ్ కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ (బుల్లెట్) మెమోరియల్– 2023 అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై ఎంఎంసీసీ(కాగజ్‌నగర్) జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 141 పరుగులు చేయగా, ఎంఎంసీసీ జట్టు 18 ఓవర్లలో 143 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విజేతతోపాటు రన్నర్‌ప్‌గా నిలిచిన జట్టుకు నగదు, ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైస్ మిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జైన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ వ్యవస్థాపకుడు అజ్గర్ అహ్మద్, నిర్వాహకులు ఖాజా రఫీఉద్దీన్ పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కలెక్టర్‌ను కలిసిన డైరెక్టర్లు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డైరెక్టర్లు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతనంగా నియామకం అయిన డైరెక్టర్లు జీ.వెంకటేశ్వర్‌రెడ్డి(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), ఎన్వీకే శ్రీనివాస్(ఆపరేషన్స్) జిల్లా నూతన కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిశారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు శ్రీరాంపూర్ ఓసీపీకి సంబంధించిన భూసేకరణ సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు కార్పొరేట్ వైద్యంపై హర్షం



కేంద్ర, రాష్ట్ర సభ్యులతో జిల్లా నాయకులు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పిస్తూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడానికి ఈహెచ్ఎస్ పథకాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మామిళ్ల రాజేందర్, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్‌లకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం టీఎన్జీఓస్ అటవీ శాఖ కేంద్ర ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరిందని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ కేంద్ర ఫోరం కార్యదర్శి, సర్కిల్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాటి చెట్టెక్కి.. ఎల్లమ్మ తల్లికి మొక్కి




మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో ఎల్లమ్మ కొలుపు సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గౌడ కులస్తులు మంగళవారం ముందుగా ఎల్లమ్మ తల్లికి మొక్కి ఒకే తాటిచెట్టును 12మంది ఎక్కి ఒకరికొకరు చేతుల మీదుగా దించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం బైండ్ల కళాకారుల పాటల మధ్య అమ్మవారి కొలుపు ఘనంగా నిర్వహించారు.

– జన్నారం

మున్సిపల్ కమిషనర్ భార్య ఆత్మహత్య

- అదనపు కట్నం కోసం వేధింపులే కారణం
- కుటుంబ సభ్యుల ఆరోపణ
- కఠినంగా శిక్షించాలని డిమాండ్



జ్యోతి(ఫైల్)



రిత్విక్, భవిష్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల్ల బాలకృష్ణ భార్య జ్యోతి(32) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. బాలకృష్ణ స్థానిక ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో భార్య, కుమారుడు రిత్విక్, కూతురు భవిష్యలతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం విధుల్లోకి వెళ్లిన కమిషనర్ మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపు లోపల గడియ పెట్టి ఉంది. అనుమానంతో తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో జ్యోతి ఫ్యానుకు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. జ్యోతి మృతదేహాన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం అందించాడు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సైలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ భార్య కావడంతో చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆత్మహత్య కాదు.. హత్యే..?

జ్యోతి తల్లిదండ్రులు గంగవరపు రవీంద్రకుమారి, రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని ఆమెది ఆత్మహత్య కాదని, హత్యేనని ఆందోళనకు దిగారు. ఉదయం తమ కూతురు వీడియో కాల్ చేసి మాట్లాడిందని, చంపేసేలా ఉన్నాడని రోదించిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లా కేశవపురానికి చెందిన బాలకృష్ణ కానిస్టేబుల్ ఉద్యోగం చేసేవాడని, 2014 ఆగస్టు 15న పెద్ద సమక్షంలో వివాహం జరిగిందని, మూడెకరాల పొలం, రూ.2లక్షల విలువైన బంగారం అందజేసినట్లు తెలిపారు. కమిషనర్‌గా ఎంపికైన తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయని, తాను కమిషనర్ నని, ఎక్కువ కట్నం వచ్చేదంటూ వేధించేవాడని ఆరోపించారు. పలుమార్లు కుటుంబ పెద్దల సమక్షంలో మందలించినట్లు తెలిపారు. జ్యోతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నారాయణ్‌నాయక్ తెలిపారు.

అమ్మా.. ఏమైంది..!

మంచిర్యాలటౌన్: ఉన్నత ఉద్యోగి భార్య.. కుమారుడు, కూతురుతో హాయిగా జీవితం సాగిపోతోంది. ఉదయాన్నే ఇద్దరు పిల్లలను రోజూ మాదిరిగా సిద్ధం చేసి, టిఫిన్ బాక్సు పెట్టి నవ్వుతూ టాటా చెప్పి బడికి పంపించింది. ఏం జరిగిందో గానీ మధ్యాహ్నం వరకు ఆ తల్లి విగతజీవిగా మారింది. ఈ దృశ్యాన్ని చూసిన చిన్నారులు రిత్విక్, భవిష్య ''అమ్మా.. ఏమైంది..'' అంటూ విలపించిన తీరు అక్కడున్న వారిని కదిలించింది. ''అమ్మా లే అమ్మా... ఏమైంది అమ్మా.. ఎందుకు లేస్తలేవు..'' అంటూ తల్లి మృతదేహం వద్ద విలపించారు.